# అమ్మ

రావు మనస్సు బాగాలేదు. ఆఫీసు మెట్లుదిగినవాడు ఇంటిమొఖం పట్టలేదు. ఇంటికెళితే.... అమ్మ సంగతి అడక్కుండానే చెప్తుంది యమున. ఆ సంగతి వినటం రావు కెంతమాత్రం యిష్టంలేదు. సాధ్యమైనన్ని గంటలు పూటలు ... రోజులు అమ్మ సంగతి వినకుండానే వుండాలి.

బుద్ధిపూర్వకంగానే పార్క్ కేసి నడిచాడు. చాలాదూరం పోయి చిట్ట చివరగా ఓ బెంచీ అంచున కూర్చున్నాడు. అల్లరిగా ఆడుకొంటున్నారు పిల్లలు. విన్పించకుండా మాట్లాడుకొంటున్నారు పెద్దవాళ్ళు. చీకటి పడకుండానే వెల్గించిన ఎలక్ట్రిక్ బల్బులు తెల్లటి చుక్కల్లా వెలాతెలా పోతున్నాయి.

రావు దృష్టి ఎక్కడా నిలబడలేదు. చికాగ్గా జుత్తులోకి వేళ్ళుగుచ్చుకున్నాడు. అలసటగా నుదురు తుడుకున్నాడు. భారంగా నిట్టూర్పు విడిచాడు. నాలుగైదు నెలలుగా — ఓ రకమైన వేదనా, అశాంతి తనను ఆవరించుకున్న సంగతి స్పష్టంగా రావుకి కూడా తెలిసి వుండదు. తను ఎప్పటిలా వుల్లాసంగా వుండటంలేదనీ — హాయిగా నవ్వటంలేదనీ — తృప్తిగా నిద్ర కూడా పోవటంలేదనీ యమున అంటోనేవున్నా రావు ఏ మంత పట్టించుకోలేదు. ఒక్కటి మాత్రం రావు కావాలనే చేస్తున్నాడు. అమ్మతో మాట్లాడటంలేదు. అమ్మని కన్నెత్తి చూడటంలేదు. అమ్మ పరిసరాలలోకూడా మసలటం లేదు. నిజానికి అమ్మసంగతి యమున చెప్పినరోజు ఎంతషాక్ తిన్నా క్రమంగానైనా సరిపెట్టుకోలేక పోవటం రావు బలహీనతే.

*　　*　　*

ముబ్బురంగులో సిల్కూ నూలూ మిక్చర్ పూనాచీర పేక్ చేయించుకొని ఆ రోజు చాలా ఆనందంగా బయల్దేరాడు యింటికి. యమున ప్రేమ్ నెత్తుకువచ్చి వారంరోజులైంది. ప్రేమ్ చాలా తెల్లగా బొద్దుగా గుండ్రటి కళ్లతో తల్లిలాగే వుంటాడు. వాడి కళ్ళలోకి చూసేసరికి కిలారు

మంటూ బోసినవ్వు నవ్వుతాడు. అప్రయత్నంగానే వాణ్ణి గుండెలకు హత్తుకుంటాడుతను. "ఓహో? పితృప్రేమ!" అంటూ హాస్యం చేస్తుంది యమున. మొదట మొదట తనకు సిగ్గువేసినా ఆ వారం రోజులలోను వాణ్ణి తనివితీరా ముద్దు పెట్టుకోవటం – అమ్మా నాన్నా వారిద్దర్నో ఎత్తుకు తిప్పడం – అలవాటయ్యాయి –' "యమునా! రత్నంలాంటి కొడుకుని ప్రసాదించావు –" అన్నాడు ఓసారి.

యమున నవ్వింది– "ముత్యంలాంటి మొగుణ్ణి చేసుకున్నానుగా?" అంది.

"నిజం చెప్పు! చందమామ వీడికన్నా అందంగా వుంటుందా?"

"ఉండదు. వాడి బాబుకన్నాకూడా అందంగా వుండదు."

"మరి నీకేం కావాలో అడగరాదూ? ఇస్తాను–" గర్వంగా చూశాడు తను.

"సిగ్గులేకపోతేసరి. కట్టుడు చీరలు కావాలని ఎన్నిసార్లు చెప్పాను! పైగా వరాలడగడం ఒకటా?" అంది చివాట్లు పెడుతూ.

వరాలిచ్చే వుద్రేకం పోయింది – "ఏమిటోయి అంతకోపం! జీతం రానీ, కొంటాంగా – ?" అన్నాడు. నవ్వేసింది యమున.

యమునకు ప్రెజెంట్ చెయ్యాలనే ఆ చీర కొన్నాడు. ప్రేమ్‌కి స్వెట్టర్‌కూడా కొన్నాడు. ప్రేమ్ మొట్టమొదటిసారి తన కళ్ళలోకి పసితనంగా – అమాయకంగా .... పవిత్రంగా చూసిన క్షణంలోనే తను చాలా మారాడు. తను తండ్రిఅయ్యాడు. బిడ్డలూ .... సంసారం బాధ్యతలూ!... తల్చుకొంటోంటే అవన్నీ మధురంగానే వున్నాయి. ఎంత తొందరగా వాటిని నిర్వహించే రోజు వస్తుందా అని ఆతృత కలగసాగింది– ప్రేమ్‌ని చదివించాలి. తనలా కాదు, బాగా చదివించాలి. అవసరమైతే రక్తంలో ఆఖరి బొట్టుకూడా అమ్మి చదివించాలి. తన మనసులోంచి, తన తనువులోంచి ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టిన బిడ్డ సర్వ సౌఖ్యాలతో సుఖపడుతోంటే .... తను శాంతిగా .... విశ్రాంతిగా తనని యింతవాణ్ణిచేసి, నాన్నా అమ్మా నిశ్చింతగా కాలం దొర్లిస్తున్నట్లు .... తనుకూడా ఒకనాటికి .... అలసిపోయిన జీవితంలో .... అతిథిగా మాత్రమే కూర్చుంటాడు.

యమున ఆలోచన లెలాంటివో రావుకి అంతగా తెలియవు. ఎలాంటి విషయాన్నయినా యమున తేలిగ్గానే తీసుకుంటుంది.

"చీర చాలా బావుంది" అంది సంతోషంగా. రావు తేలికపడ్డాడు. బట్టలు మార్చుకొని, మొహం కడుక్కువచ్చి కూర్చున్నాడు. యమున కాఫీ అందిస్తూ నవ్వింది - "మీకు నేను చెప్పింది ఒకటీ - మీరు తెచ్చింది మరోటీనూ...."

"ఫర్వాలేదు. ఆ చీరలు మరోసారి చూద్దాం. బాబు స్వెట్టర్ చూశావా?"

"బావుంది."

"బావుండటం కాదోయ్! అదివేసి వాణ్ని వేరే పడుకోబెడితే చలేం వెయ్యదుగా?"

యమున నవ్వుతూనే అంది - "మీరుకూడా ఓ స్వెట్టర్ కొనుక్కుంటే మీకూ చలి వెయ్యదుగా?"

"అలా పెంకితనం చేస్తే వూరుకోనుమరి."

"మూడు నెలలయినా నిండని ఆ పసివాడిమీద ఎందుకో మీకంత అసూయ? వాళ్ళమ్మదగ్గరే వాడు పడుకుంటాడు. స్వెట్టరూ గిట్టరూ అక్కర్లేకుండా అమ్మగుండెల్లో వెచ్చగా నిద్రపోతాడు. ఏం? పాతికేళ్ళునిండిన మిమ్మల్ని మీఅమ్మ ఈ నాటికీ పసిబిడ్డలా చూసుకొంటుంటే నేను అప్పుడే వాణ్ని గాలికి విడిచిపెట్టనా? ఊహు! నావల్లకాదు బాబూ?"

రావు నవ్వాడు. వేడివేడి కాఫీ తాగుతూ కూర్చున్నాడు. యమున స్వెట్టర్ విప్పి బాబుకి తొడిగింది.

"అయితే యమునా! మా అమ్మ మంచిదా? బాబు అమ్మమంచిదా?"

"మీ అమ్మే మంచిది."

"ఎందుకో?"

"ఈ నాటివరకూ మిమ్మల్ని పెంచుతూనే వున్నారుగా? నా మాట అప్పుడే ఏం చెప్పగలం?" - గుండ్రటి యమున కళ్ళనిండా పొంగులెత్తే మాతృత్వపు మమత చూడగలిగాడు రావు. యమున ప్రేమ్‌ని హృదయానికి హత్తుకొని నిలబడింది - రావు తదేకంగా చూశాడు. ఆ దృశ్యం రావు

హృదయంనిండా అలుముకొంది, - "యమునా!" - అప్రయత్నంగా లేచి దగ్గరికి నడిచాడు - "నేనూ ఆడపిల్లనైపోతే అమ్మను కౌగలిగితే?"

నవ్వింది యమున. బాబుని వుయ్యాల్లో పడుకోబెట్టి జోకొడుతూ అంది.

"మీకో కబురు చెప్తాను. భలే ఆశ్చర్యంగా వుంటుంది."

"ఆహా(" అన్నట్టు చూశాడు రావు.

"నా మాట నమ్మరేమో!"

"చెప్పు చూద్దాం."

"మీరు రాగానే చెప్పాలనుకుంటే పిచ్చి పిచ్చి కవిత్వంలో పడ్డారు."

"అసలేమిటా కబురు? చిత్రమా? విచిత్రమా? విచారమా? సంతోషమా."

"విచిత్రమేంకాదు. కానీ చిత్రమే. విచారం మాత్రం దేనికి? సంతోషమే."

"ఓహో! ఏమిటబ్బా అది?"

"ఆలోచించండి చూద్దాం."

"ఏదో సామెత చెప్పినట్టే వుంది నీ ధోరణి."

"అసలు మీరు నా మాట నమ్మటంలేదు కదూ?"

చిరాగ్గా నుదురు చిట్లించాడు రావు - "ఏమిటా పెంకితనం? నువ్వేం చెప్పక్కర్లేదు గానీ .... సినిమాకి వెళ్దాం. కాస్త తొందరగా బయల్దేరు. కొత్తచీర కట్టుకో."

"అమ్మో? ఇప్పటికి వంటాగింటా మొదలెట్టలేదు. చాలా పని వుందే?"

"ఏం? అమ్మ ఏమైంది."

యమున కళ్ళలో నవ్వు చిందింది - "పడుకున్నారు."

"వంట్లో బాగాలేదా?" ఆతృత వ్యక్తపరిచాడు రావు.

"ఒంట్లో బాగానే వుంది. మనస్సు బాగాలేదేమో?"

"ఏమిటే నాయనా నీ తలతిరుగుడు? ఆ చెప్పేదేదో సరిగ్గా చెప్ప రాదూ?"

"అయితే చెప్పేస్తాను. శ్రద్ధగా వింటారుగా? .... ఓ నాలుగైదు నెలల్లో .... వింటున్నారా? .... మీకు చెప్పేస్తున్నాను. చిన్ని తమ్ముడో చెల్లాయో పుడతారు. వినేశారా?" – ఫక్కుమంది యమున.

"చాల్లే! ఏమిటా మోటు హాస్యం?" – రావు చురుగ్గా చూశాడు.

"బావుంది. మధ్య నాదా మోటుహాస్యం? తమ్ముణ్ణెత్తుక వూరేగేది మీరేగా?"

విస్మయంగా చూశాడు. "అబ్బా! ఏమిటింత వెకిలిదాని వౌతున్నావు?"

యమునకు కాస్త కోపం వచ్చింది — విసురుగానే అంది — "ఉన్న సంగతి చెప్పాను. నమ్మితే నమ్మాలి, మానితే మానాలిగానీ, నా మీద దేనికి మీ కంత చిరాకు?"

"అదికాదు యమునా!" – సామరస్యంతోనే ఆశ్చర్యంగా అన్నాడు.

"అసలేమిటి అమ్మకి .... "

"ఏమో! ఏమిటో? మీ అమ్మని అడగరాదూ వెళ్ళి!"

"చాలుగాని చెప్పూ! ఎందుకలా అన్నావు? ఎవరు చెప్పారు నీకు?" రావు మాటల్లో చూపుల్లో అపరిమితమైన ఆతృత కొట్టవచ్చింది.

ఒక్క క్షణం చూసి మామూలుగా అంది యమున – "నా మాట కొట్టిపారేస్తోంటే నేనేం చేసేది!" – అంటూ ఆ సంగతేమిటో చెప్పింది. "అసలావిడికి రెండు మూడు నెలలనుంచీ అనుమానంగానే వుందట" కాస్త గొంతు తగ్గించింది – "బహిష్టులు పోతాయో ఏమిటో అనుకున్నారట. తీరా ఓ పదిహేనురోజులుగా మరీ సరిపెట్టుకో బుద్ధిగాక ఇవ్వాళ పొద్దున్న సీతమ్మ పిన్నిగార్ని తీసుకుని ఆస్పత్రికి వెళ్ళారు. అసలు వెళ్ళేముందు నాకు చెప్పనేలేదు. వచ్చాక మాత్రం చెప్పారేమిటి? పిన్నిగారే చెప్పింది– డాక్టరమ్మ పరీక్షచేసి ఐదో నెలని చెప్పిందట. పెద్ద వయస్సు కాబట్టి జాగ్రత్తగా వుండాలనీ, మంచి ఆహారం అదీ తీసుకోవాలనీ – నెలనెలా వచ్చి పరీక్ష చేయించుకోవాలనీ – పురిటికి మాత్రం తప్పకుండా ఆస్పత్రికి రమ్మనీ – ఇంకా ఏవిపేవిటో చెప్పిందట."

మాటా పలుకూ లేకుండా నిలువు గుడ్లతో చూస్తోన్న రావు మొహం

కేసి చూస్తూ మళ్ళీ ప్రారంభించింది — "మీ అమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటోంటే డాక్టరమ్మ భుజంమీద చెయ్యివేసి మరీ ధైర్యం చెప్పి బుజ్జగించిందట — "పెద్దవయస్సయినా మీరేమీ భయపెట్టుకోకండి. నేను మీ కే ఆపదా రాకుండా పురుడు పోసి పంపుతానుగా! అప్పుడప్పుడూ వచ్చి తప్పకుండా పరీక్ష చేయించుకొంటూ వుండండి. ఓ టానిక్ రాసిస్తాను. శ్రద్ధగా వాడండి — అంటూ ఏదో రాసికూడా యిచ్చిందట! ఆ చీటీ మీ అమ్మ ఆస్పత్రి దాటగానే చించిపారేశారట. మొహం అదోలా పెట్టుకు యింటికి వస్తే ఏమో అనుకున్నాను. రాగానే గదిలో నేలమీద కొంగు పర్చుకొని పడుకున్నారు. ఎంత పలకరించినా మాట్లాడారుకాదు. ఒంట్లో బాగాలేదో ఏవిటో అని వూరుకున్నాను. సీతమ్మపిన్ని అంతా చెప్పింది. మొదట మీలాగే ఆశ్చర్యపోయా ననుకోండి. తీరా ఆవిడ మొహం చూడాలంటే నాకు భలే సిగ్గువేసింది. చెప్పద్దూ? నాలో నేను నవ్వుకోలేక చచ్చాను. ఏమీ ఎరగని దానిలా — 'అన్నానికి రండి అత్తయ్యా'! అని పిల్చాను."

"నేను తినసమ్మాయీ! నువ్వు భోంచెయ్యి" — అన్నారు.

"అదేమిటి? ఒంట్లో బాగాలేదా?"

"అబ్బే తర్వాత తింటాలే. నువ్వు భోంచెయ్యి."

మరి లేచి రానేలేదు. నాకూ ఒక్కదాన్నీ తినటానికి సహించక వూరుకున్నాను. మధ్యాహ్నం మీరు భోజనానికి వచ్చినప్పుడు చెప్పేద్దామనుకున్నానుగానీ ఎందుకో చెప్పబుద్ధికాలేదు. మీరు వెళ్ళాక పిన్నినిపిలిచి ఆవిడ అన్నం తినడంలేదని చెప్పాను. పిన్ని అత్తయ్యని మందలించింది— "పిచ్చా? వెర్రా? ఎందుకలా బెంబేలు పడతావు? దేవుడిస్తే దెయ్యం కంటుందిట. వాడి యిష్టం గానీ మన చేతుల్లో ఏముంది? నీకన్నా పెద్దవాళ్ళయి పురుళ్ళు పోసుకున్న వాళ్ళు యెంత మంది లేరు? నువ్వేం తప్పుడు పని చేశావు గనకా? చాలుగాని లేచి అన్నం తిను. నీకోసం యమున కూడా అలా వుండి పోయింది. చంటిబిడ్డ తల్లి. వేళాపాళా లేకుండా తింటే పాలు కాస్తా తగ్గేను. లేచిరా వదినా! లేచిరా!" అంటూ బలవంతంగా లేవదీసి అన్నం కలిపి తినిపించినంత చేసింది. అబ్బ నాకు నవ్వు ఆగదే! ముక్కూ, నోటా రెండుముద్దలు కుక్కుకుని పెరట్లోకి పరుగెత్తాను. పళ్ళెం

కడుక్కొని యింట్లోకివచ్చేసరికి ఆవిడ మళ్ళా ముణగదీసుకొని పడుకొన్నారు." యమున నోటికి కొంగు అడ్డం పెట్టుకుని రావుకేసి చూసింది. రావు యేమీ వినని వాడిలా యెటో చూస్తూ నిలబడ్డాడు. యమున మళ్ళా అంది– "పాపం, అత్తయ్యకి భయమో యేమిటో కుళ్ళి కుళ్ళి యేడుస్తున్నారు. అన్నట్టు మావయ్యకి కూడా తెలిసిపోయింది. పిన్ని నవ్వుతూ నవ్వుతూ చెప్పేసింది. అందరిలాగే ఆయనా ఓ ఘడియ విస్తుపోయినట్టు చూసి మళ్ళా నవ్వుకుంటూ వెళ్ళిపోయారు."

చటుక్కున తల తిప్పి చూశాడు.

"అదేవిటి? మీ రెందుకలా చూస్తారూ? నేను చెప్తోంది అబద్ధమా ఏమిటి? కావాలంటే పిన్నిని పిలుస్తాను, అడగండి .... అయ్యో! మర్చిపోయాను. ఎసరు మరిగిపోతోందో .ఏమో?" – లోపలికి పరిగెత్తింది యమున.

రావు హఠాత్తుగా స్టాండుమీది బట్టలు వేసుకొని వరండాలోంచి వెళ్తూ జోళ్ళు తగిలించుకొని మెట్లుదిగి రోడ్డుమీద పడ్డాడు.

* * *

గబ గబా గాలి పీల్చుకొంటూ నడిచాడు. ఆ రోజుకూడా పార్కు చివరికంటా పోయి వొంటరిగా కూర్చున్నాడు. అమ్మ కబురు తల్చుకొంటూంటే ఎప్పటికప్పుడే విశ్రాంతి కలుగుతోంది. యమున చెప్పింది నిజమా కాదా అన్న ఆలోచన అక్కర్లేదు. యమునే కాదు ఎవ్వరూ యిలాంటి అబద్ధాన్ని కల్పించలేరు – తనకి తమ్ముడో .... చెల్లాయో .... ఇప్పుడు .... ఛీ! ఎంత సిగ్గుచేటు! తను పెరిగి పెద్దవాడై తండ్రికూడా అయితే ఇంకా తన తండ్రి పిల్లల్ని కనటమా? ఆ సంగతివిని ఆయన నవ్వుకున్నాడా? రావు నేదో అర్థంకాని అసహ్య భావం ముంచివేసింది. శరీరం యావత్తూ ఏవగింపుతో జలదరించింది. – తననీ తన సంతానాన్నీ చూసుకొంటూ నిర్వికారంగా కాలం గడిపేయాల్సిన తల్లి దండ్రులు ....

దుర్భర మనిపిస్తోన్న కొద్దీ అవే ఆలోచనలు రావుని చుట్టుముట్టాయి. అమ్మకి నలభై మూడేళ్ళు దాటాయి. నాన్నకి యాభై ఏళ్ళ

యినా ఉంటాయి. ఇద్దరూ జీవితాన్ని చాలవరకు అనుభవించి దాదాపు చరమస్థితికి వచ్చారు. కొడుకూ కోడలూ - కూతురూ -- అల్లుడూ .... రెండువేపులా మనుమలూ .... కళ్ళ ఎదురుగానే ముందు తరాలకు వారసులు బయల్దేరుతోంటే .... ఆ ఆనందమంతా అనుభవించాల్సిన అదృష్టం వాళ్ళకి వుంది. యౌవ్వన భాగ్యాన్ని అనుభవిస్తూ సృష్టిని పెంచడమే మానవుడి ధ్యేయమైతే అది వాళ్ళు నిర్విఘ్నంగా నెరవేర్చారు. అమూల్యమైన తమ బాధ్యతలు బిడ్డలమీద పెట్టి కాలప్రవాహంలో నీటిబొట్లులై కలిసిపోవటం కన్నా వాళ్ళు కోరదగినదేమీ లేదు. కాని .... కాని వాళ్ళకి .... ఇప్పుడు .... పసిబిడ్డ .... ఒక్కసారిగా ఆ యిద్దరి మీదా రావుకి పట్టరాని కోపం ముంచుకు వచ్చింది - వాళ్ళ బాధ్యత లేమిటో వాళ్ళకు తెలియకుండా పోయాయి. వాళ్ళ శరీరాలే కాదు - ఆత్మలుగూడా అపవిత్రమయ్యాయి. కాలప్రవాహానికి ఎదురీదిన దురాశాపరులయ్యారు.... వాళ్ళు .... వాళ్ళు ఎక్కువేమీ ఆలోచించ బుద్ధికాలేదు రావుకి.

చీకటిపడ్డా లేచి యింటికి వెళ్ళటానికి మనస్కరించలేదు. అమ్మ కన్పిస్తే .... చెట్టంత కొడుకు మొహం చూడటానికి సిగ్గుపడిపోదూ? నాన్నమాత్రం? ఏ మొహం పెట్టుకు వీధిలో తిరుగుతాడు? బిడ్డల మొహం చూస్తాడు?

రావు చాలాసేపు అక్కడే కూర్చున్నాడు. లేవక తప్పలేదు. ఇంటికి వెళ్ళకా తప్పలేదు. గుమ్మంలో అడుగు పెడుతోంటే గుండెలు బాధగా కొట్టుకుంటున్నట్టనిపించింది. తండ్రి కంఠస్వరం చెవుల్లో పడే సరికి ఒళ్ళంతా వికారాల మయమైంది. రోజులానే తండ్రి ప్రయివేటు కుర్రాళ్లకు పాఠాలు చెప్తున్నాడు. ఆయన కీయింటితోనూ మనుష్యులతోనూ సంబంధం వున్నట్టే లేదు.

మొహం చిట్లించుకుంటూ గబగబా లోపలికి వెళ్ళాడు. ఉయ్యాల వూపుతోన్న యమున ఎదురువచ్చింది. ఒక్క క్షణం చూశాడు రావు .... సాయంత్రం తెచ్చిన కొత్తచీర కట్టుకుంది. చటుక్కున తల తిప్పుకుని చొక్కా విప్పుతూ స్టాండు దగ్గరికి పోయాడు, కొంచెం ఆశ్చర్యపడుతూనే

వెనక నడిచింది - "మీరు సరిగ్గా చూడలేదనుకుంటాను. సాయంత్రం తెచ్చిన కొత్తచీర కట్టుకొన్నాను."

"కనబడుతోందిగా? చూడకపోవటం ఏమిటి?"- ముక్తసరిగా అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది యమున - "అదేం అలా వున్నారు? .... ఇందాకకూడా చెప్పకుండానే వెళ్ళిపోయారే?"

"అబ్బ! ఇక నువ్వు కబుర్లకి దిగితే యింతే; వచ్చీ రాగానే ఏమిటి నీ ప్రశ్నలు?" - టవల్ భుజంమీద వేసుకుని రెండంగల్లో బాత్ రూం కేసి నడిచాడు. యమున పల్కరించకుండానే అన్నం వడ్డించింది. రావు దించినతల ఎత్తకుండా గబగబా రెండు ముద్దలు తిని ఎవరో తరుముకొస్తున్నట్టే గదిలోకొచ్చి పడ్డాడు. అమ్మ కనిపించలేదు. ఏ క్షణంలో బయట కొస్తుందోనని కంగారుపడ్డాడు. కాస్త తేలిగ్గా గాలి పీల్చుకున్నాడు?

తండ్రి కంఠం విన్పించటంలేదు. ప్రయివేటు పిల్లలు వెళ్ళిపోయి నట్టు ఉన్నారు. తనకు గుర్తున్నంతవరకూ తన తండ్రిని ఇంతగా ఆక్షేపించి అసహ్యించుకున్న రోజు ఎన్నడూలేదు. అమ్మంటేనే తనకు బాగా ఇష్టమైనా, నాన్నంటే కూడా యిష్టం వుంది. ఆయన తనను కనీ పెంచీ పెద్దవాణ్ని చేశారన్న భావం ఎన్నడూ తనకు మరుపురాలేదు. తనను చదివించే రోజుల్లో డబ్బుకోసం యిబ్బందిపడే నాన్నను చూస్తూ తను కన్నీళ్ళు తెచ్చుకున్న ఘట్టాలుకూడా వున్నాయి. గుండెలనిండా నిండివున్న అదే అభిమానంతో తను ఎన్నోసార్లు చెప్పాడు- "రిటైరయ్యాకకూడా నీకీ యాతనెందుకు నాన్నా? నువ్వు ప్రయివేటు చెప్పక పోతే మాత్రం మనం బ్రతకలేకపోతామా? హాయిగా విశ్రాంతి తీసుకో, చాలు" - అన్నాడు.

ఎంత చెప్పినా నాన్న విన్నాడు కాదు - "రోజంతా విశ్రాంతిగాక ఏముందిరా? నలుగురు మనుషులం. బ్రతకటం మాటలా?"- అన్నాడు. రిటైరయిన మర్నాటినుంచీ అలాగే జరుగుతోంది.

"అమ్మా, యమునా! కొంచెం మంచినీళ్ళు తెచ్చి పెట్టగలవా?" తండ్రి కంఠస్వరం చెవుల్లో పడేసరికి మళ్ళా ఏదో అర్థంకాని ఏహ్యాభావం రేగినట్టయింది. యమున గదిలోకి వస్తోన్నదల్లా - "ఆఁ, వస్తున్నా

మామయ్యా!" అంటూ మళ్ళా వెనక్కి వెళ్ళింది.

రాత్రుళ్ళు నాన్న మంచం దగ్గిర మంచినీళ్ళ చెంబుపెట్టి పక్క వేస్తుంది అమ్మ రోజూ. అమ్మ రోజులాలేదు.

అమ్మ....! అనుకుంటేనే ఏదో హాయి కలుగుతుంది మనస్సుకి. దిన చర్యను యమునతోకన్నా అమ్మతోనే ఎక్కువ సాన్నిహిత్యం వుంటుంది రావుకి. ఇంట్లో వంటా వార్పూ అంతా అమ్మే చేస్తుంది. యమున చేసిన రోజు యమునకూడా నసుగుళ్లు పోతూనే తింటుంది. "యమునకి వంటలన్నీ నేర్పమ్మా! నువ్వు ఎక్కడికన్నావెళ్తే ఈ నల భీమపాకంతో మా ప్రాణాలు తీస్తుంది" – అంటాడు రావు. అమ్మ నవ్వుతుంది– "నీ పెళ్ళానికి వంటలన్నీ నేర్పేసి నన్నెక్కడికైనా వెళ్ళిపొమ్మనా ఏమిటి అర్థం?"– అంటుంది కోపం ప్రదర్శిస్తూ.

"మధ్య మీ రిద్దరూ దెబ్బలాడుకోకండి, ఎవరు నేర్పినా నేను నేర్చుకోను" అంటూ ఖరాగా కూర్చుంటుంది యమున.

అమ్మలాంటి అత్తగారు వున్న యమున చాలా అదృష్టవంతురాలే. సంసారంలో ఏ బాధ్యతలూలేవు. ఇంటి పనుల్లో ఏ చీకూ చింతా లేదు. రావు ఏ క్షణంలో బుద్ధిపుడితే ఆ క్షణంలోనే యమునను తీసుకొని సినిమాకి పోతాడు. షికార్లు తిరుగుతాడు. గంటల తరబడి కబుర్లు చెప్తూ కూర్చుంటాడు. అమ్మ అన్నింటికీ నవ్వుతుందేకాని ఎన్నడూ చిరాకు పడదు. విసుగుదల చూపించదు. అమ్మకు కన్నకూతురు సుశీల ఒకటీ– యమున ఒకటీ కాదు. ఆ సంగతి రావుకన్నా యమునకే బాగా తెలుసు.

యమున లోపలికి వస్తూ తలుపులు మూసింది. ఉయ్యాల్లో బాబుని తీసి మంచం మీద పడుకోబెట్టింది. "లైట్లు తీసివెయ్యనా? మీరేమైనా చదువుకుంటారా?"–అంది. రావు మాట్లాడలేదు. యమున దగ్గరికివచ్చింది– "ఒంట్లో బాగాలేదా? దేనికీ మాట్లాడరేం? బావుంది. చెప్పకపోతే నా కెలా తెలుస్తుంది?" – అంది నిష్ఠూరంగా.

రావు కొంచెం నవ్వాడు– "తెలీకపోవటం ఏమిటి! అన్నీ నువ్వే అనుకోగలవు."

"నా కేం దివ్యదృష్టి లేదు."

రావు నెమ్మదిగా అడిగాడు- "అమ్మ భోంచేసిందా?"

"లేదు. కొంచెం మజ్జిగ తాగి పడుకున్నారు."

కాస్సేపయ్యాక అన్నాడు రావు- "అన్నం తినమని నువ్వు బాగా చెప్పలేకపోయావా?

"చెప్పకుండానే వూరుకున్నానా? ఆవిడ ధోరణి ఆవిడదే. అస్తమానూ కళ్ళనీళ్లు పెట్టుకోవటం మనసులో బాధపడటమూ, ఏమిటో నాకు భయంగా వుంది బాబూ! చివరికి అన్నానుకూడాను, "డాక్టరమ్మ జాగ్రత్తగా పురుడు పోస్తానని ధైర్యం చెప్పిందికదూ అత్తయ్యా? మీ కెందుకు భయం?"

"నా ప్రాణం పోతుందని భయపడుతున్నావా అమ్మా?" అన్నారు.

"మరెందుకో?" - అప్రయత్నంగా అడిగాడు రావు.

"బావుందండీ! పాపం ఆవిడికి మాత్రం సిగ్గుగాదూ?"

"యమునా! అమ్మ గురించి మనం యిలా మాట్లాడుకోనడం చాలా అసభ్యంగా వుంటుంది గానీ - నా ఉద్దేశ్యం చెప్పాలంటే ఆవిడ ఏడ్చి ఏం ప్రయోజనం సాధిస్తుంది? జరిగిన దానికి ఆవిడ బాధ్యత లేక పోలేదుగా?"

"ఇది మరీ బావుంది. ఆవిణ్ని తప్పుపడుతున్నారేమిటి?" - విస్మయంగా అంది యమున. రావు మాట్లాడలేదు.

"సీతమ్మ పిన్ని ఓ గమ్మత్తుచేసింది."- అంది యమున నవ్వుతూ. వృత్త మాటలపోగు. మామ్మాలు విషయాలు కూడా గమ్మత్తుగానే చెప్తుంది- "ఇందాక మళ్ళా పిన్ని వచ్చింది, అత్తయ్యని చూసి ఏమందో తెలుసా? 'అలా కుళ్ళి కుళ్ళి కూర్చోకపోతే ఏ మందో మాకో మింగ రాదూ? వెధవ బాదరబందీ పోతుందిగా?' అంది.'

"ఏ మందీ అమ్మ ...." కంగారుగా అడిగాడు రావు.

"పాపం ఏమీ అనలా. అలా పిచ్చిదానిలా చూస్తూ కూర్చున్నారు. అంతలోనే పిన్ని నవ్వేస్తూ - 'నమ్మేశావా ఏమిటి వదినా? హాస్యాని కన్నానులే చాలుగానీ నువ్వెందుకమ్మా అంత కుళ్ళిపోతావూ?' అంటూ ఏవేవో నచ్చజెప్తూ కూర్చుంది."

"ఛ! అలాంటి పని మాత్రం ఎప్పుడూ చేయవద్దని చెప్పు. పెద్ద ప్రాణానికే మోసం వస్తుందంటారు."

"ఏం? చిన్న ప్రాణం అక్కర్లేదు కాబోలు. నాకు మాత్రం ఓ మరిదే పుడతాడంటే బలే సరదాగావుంది" – రావు దగ్గిరగా కూర్చుంటూ అంది యమున – "నిజం చెప్పండి.... మీకో తమ్ముడు పుడతాడంటే...."

రావు కళ్ళకి అడ్డంగా చెయ్యివేసుకున్నాడు. ఈ గదిలో తను.... మరో గదిలో తన తండ్రి ... పళ్ళమధ్య పెదవి నొక్కిపట్టి బలంగా గాలి పీల్చి విడుస్తూ పడుకున్నాడు.

*  *  *

అత్తారింటినుంచి సుశీల వచ్చింది అమ్మని చూడటానికి. సుశీల యమునతో అంటోంటే రావు కూడా విన్నాడు – "నీ ఉత్తరం చదివి నే నసలు నమ్మలేకపోయాను వదినా! ఇంట్లో వాళ్ళకి ఎలా చెప్పాలా అని భలే తికమక పడ్డాను! చదువుకోమని మా ఆడబిడ్డకు ఉత్తరం ఇచ్చేశాను– ఆవిడ నన్ను ఒకటే హాస్యాలు పట్టించింది. చెప్పొద్దూ? భలే సిగ్గువేసిందిలే. పాపం మా అత్తగారు మాత్రం కూతుర్ని మందలించి —" అదే విషయం మీద ఓ పావుగంటేనా మాట్లాడింది సుశీల. రావుకి చిరాకు వేసింది. ఏమిటో ఈ ఆడవాళ్ళంతా ఒక్కటే .... బొత్తిగా ప్రపంచ జ్ఞానం వుండదు.

నాలుగురోజులు వుంది సుశీల. ఎక్కడ అమ్మ విషయం తెస్తుందో నన్నట్లు రావు ఏవేవో పనులు కల్పించుకుని చాలా ముభావంగా ప్రవర్తించాడు. "అన్నయ్యా!" – అంటూ సుశీల ప్రారంభించిన ధోరణిని పెరగ నివ్వకుండా చేశాడు – వెళ్ళేరోజు యమునతో నవ్వుతూ చెప్పింది సుశీల– "వదినా! నువ్వే జాగ్రత్తగా చూచుకోవాలి అమ్మని. అమ్మ చిన్నపిల్లలా బెంగపెట్టుకుంది. పురిటినాటికి మళ్ళీ వస్తాను. నేను అత్తారింటికి పోయినా మళ్ళా ఓ ఆడబిడ్డ వుంటుందిసుమా నీ మీద పెత్తనం చెయ్యటానికి! మర్చిపోకేం?" అంటూ గలగలా నవ్వింది.

"ఎందరెన్ని చెప్పినా ఆవిడకు మనశ్శాంతి లేదు. ఆ దిగులేవిటో

అర్థం కాదు"- అంది యమున తర్వాత.

"మతి లేకపోతే సరి"- అన్నాడు రావు.

ఓ రోజు మధ్యాహ్నంవేళ తలనొప్పి ఎక్కువగా వుందని ఆఫీసులో పర్మిషన్ తీసుకుని యింటికి వచ్చేశాడు రావు.

గడపలో కూర్చుని బియ్యం ఏరుతోంది అమ్మ. ఒక్కసారి కళ్లెత్తి చూసి చటుక్కున తల దించేసుకుంది. కుడిభుజం మీదుగా పైటకొంగు కప్పుకుని బియ్యంలో వేళ్ళు కదుపుతూ కూర్చుండి పోయింది.

అనుకోకుండా అమ్మను చూశాడు రావు చాన్నాళ్ళ తర్వాత. అలా అన్నాళ్ళ తర్వాత అమ్మనిచూస్తుంటే ఏదో ఆనందంలాంటి భావం కలిగినట్టయింది. తడబడుతూనే అమ్మ ముందునుంచి గదిలోకి నడిచాడు.

యమున పుస్తకం చదువుకొంటూ తీరిగ్గా పడుకుంది— "ఇదేమిటి? వేళగానివేళ ...." అంటూ ఆశ్చర్యం ప్రకటించింది లేస్తూ!

"తలనొప్పిగా వుందని వచ్చేశాను. బట్టలు మార్చుకొని పక్కమీద కూర్చున్నాడు రావు- "కొంచెం టీ పెట్టి తీసుకురా యమునా!"

"అలాగే-" అంటూ వెళ్ళింది.

అమ్మ కంఠం విన్పించింది చాలా కాలానికి- "జ్వరం ఏమైనా తగిలిందేమో చూడలేక పోయావూ? ఓ గంట క్రిందట అన్నం తిని వెళ్లాడు. ఎందుకైనా మంచిది. నిద్రపోవద్దని చెప్పు. నువ్వు వెళ్ళి దగ్గర కూర్చో."

యమున లోపలకు వచ్చేసింది — "టీ అత్తయ్య పెడతానన్నారు." అంటూ కూర్చుంది!

"అమ్మాయీ!" — అని పిలిస్తే యమున వెళ్ళి టీ గ్లాసు తీసుకు వచ్చింది. రావు చాలా యిష్టంగా తాగాడు. టీ రుచిగాకూడా వుంది. యమున మాట్లాడుతూనే వున్నా రావుకి నిద్ర ముంచుకు వచ్చింది. లేచే సరికి జ్వరం కూడా తగిలింది.

"వాణ్ణి నిద్రపోనివ్వద్దని ఎంతచెప్పాను!"- అంటూ అమ్మ చివాట్లు పెడుతోంటే-"టీ తాగికూడా నిద్రపోయిన పెద్ద మనిషిననక 'నన్నంటారేం?" అంటూ యమున జవాబు చెప్పటం రావు విన్నాడు. నవ్వొచ్చింది- "జ్వరం వస్తే మాత్రం శాశ్వతంగా వుండి పోతుందా? అదే పోతుంది—" అను

కున్నాడు దుప్పటి కప్పుకొంటూ.

మళ్లా మెలుకువ వచ్చేసరికి అంతా చీకటిగా వుంది. ఒళ్ళంతా చెమటలు పట్టి ఉక్కపోస్తోంటే దుప్పటి తీసేసి లేచి కూర్చున్నాడు. దాహంతో నోరు పిడచకట్టుకు పోతోన్న ట్లనిపించింది.

"యమునా!" - అన్నాడు నెమ్మదిగా.

కంటి చూపు చీకటికి అలవాటు పడింది. యమున బాబుని దగ్గరకి జరుపుకొని గాఢంగా నిద్రపోవటం కన్పించుతోంది. అంత హాయిగా నిద్ర పోతున్న యమునను లేపటానికి మనస్కరించలేదు. నెమ్మదిగా లేచి మంచి నీళ్ళకోసం నాలుగువేపులా చూశాడు. గది తలుపులు తీసుకొని వరండాలో అడుగు పెట్టాడు.

"ఎవరదీ?" – అమ్మ కంఠం గంటలా విన్పించింది. "యమునా!" చటుక్కున లోపలకు వచ్చేశాడు రావు – "యమునా! యమునా!" అంటూ తట్టి లేపాడు.

నిద్రలో విసుక్కొంటూ పక్కకు తిరిగి పడుకుంది యమున. "ఒక్కసారి లేచి కొంచెం మంచినీళ్ళు తీసుకురద్దూ!" — అన్నాడు బ్రతిమాలు తోన్నట్టు.

యమున బద్ధకంగా కళ్ళు నలుపుకొంటూ లేచి కూర్చుంది. అసలేవీ విన్పించుకున్నట్టు లేదు.

"కొంచెం మంచినీళ్ళు తీసుకురా యమునా! దాహం వేస్తోంది."

"మర చెంబులో లేవూ?"

"ఊహూ! మరచెంబే లేదు."

"మర్చి పోయాను కాబోలు" - అనుకొంటూ లేచి వెళ్ళింది. కాస్సేపటికి గ్లాసునిండా వేన్నీళ్ళు తెచ్చి గ్లూకోజు కలిపి యిచ్చింది – ఇస్తూ — "లేవటానికి నే నేమైనా విసుక్కున్నానా ఏమిటీ!" — అంది.

"మంచి నిద్రలో లేపితే ఎవరికైనా విసుగొస్తుంది .... ఇవేవిఁటి? వేడీన్నళ్ళెక్కడివి? అప్పుడే ఎలా కాచావు?" — అన్నాడు గ్లాసు అందుకుని.

"నే వెళ్ళే సరికి అత్తయ్య కుంపటి అంటిస్తున్నారు. మీరు నన్ను లేపటం విన్నారట. గబగబా నీళ్ళు కాచి యిచ్చారు. సాయంత్రం కాసిన్ని

వేడినీళ్ళ ఫ్లాస్కు-లోపోసి వుంచమని ఆవిడ చెప్పనే చెప్పారు. నేనే మర్చిపోయాను-" యమున మళ్లా బద్ధకంగా పక్క-మీద ఒరిగింది.

రావు ఆశ్చర్యపడుతూనే నీళ్ళు తాగాడు. ఎంతో ఓపిక కూడదీసుకున్నట్టయింది. ఈ అర్ధరాత్రి అమ్మ తనకోసం వేడి నీళ్లు కాచి యిచ్చింది .... బద్ధకం లేకుండా. ఉత్త మనిషి కూడా కాదు. .... కడుపులో దేవినట్టయింది. ముడుచుకు పడుకున్నాడు.

* * *

అమ్మ అప్పుడప్పుడూ. రావు కళ్ళబడుతూనే వుంది. దృష్టి తప్పించుకొని అయిష్టంగా ప్రవర్తిస్తూనే ఉన్నాడు రావు.

ఉదయం అప్రయత్నంగా అమ్మని చూశాడు.

అయిష్టంగానే కళ్లారా చూశాడు.

మనస్సు ద్రవించినట్టయింది.

చీటికతోనే తల స్నానం చేసిన అమ్మ నిండుగా బట్ట కప్పుకుని యింట్లోకి వస్తోంది. పెరట్లోకి వెళ్తున్న అమ్మని కళ్ళారా చూసి పక్క-కి తప్పుకుని దారి యిచ్చాడు. అమ్మ భారంగా నడుస్తూ నడకలో తడబడుతూ ఇంట్లోకి వెళ్లింది. అసలే అల్పంగా వుండే అమ్మ మరీ బలహీనంగా బొత్తిగా ఒత్తిలా అయిపోయింది. తమ్ముడో చెల్లాయో ఎవర్నో ఆ ఎత్తుగా వున్న కడుపు తప్పితే అమ్మ శరీరంలో మరి ఏ పుష్టిలేదు.

తన ఎదురుగా నడిచి వెళ్ళటానికి అమ్మ సిగ్గు పడుతోందని స్పష్టంగా తెలిసిన రావు వెనక్కి- వెళ్ళలేక పోయాడు.

నిండు నెలలతో వున్న అమ్మని చూస్తోంటే తన నెవరో మంత్రించినట్టయింది. రెండు కళ్ళూ చాలవనిపించింది. ఆ క్షణంలో అమ్మ పాదాలను కళ్ళ కద్దుకోవాలన్నంత ఆవేశం కలిగింది.

గదిలోకి వెళ్ళి యమునను పిల్చాడు - "అమ్మ ఏమైనా మందులవీ తీసికొంటోందా?" - అన్నాడు ఆసక్తి కన్పించనివ్వకుండా.

"ఇప్పుడా జ్ఞాపకం వచ్చింది మీకు? రేపో మాపో ఆవిడ ప్రసవించటానికి సిద్ధంగా వుంటేను."

"పోనీ అప్పుడప్పుడూ ఆస్పత్రికి వెళ్తోందా?"

"ఏదీలేదు. నేను రెండు మూడు సార్లు అన్నాను కూడాను. ఏమీ అక్కర్లేదన్నారు. మీతో చెప్దామా అంటే మీరేవిటో ఎడమొహం పెడ మొహం. ఏమో బాబూ! అంత బలహీనంగా .... ఆవిడెలా కంటారో గానీ .... నాకు భయంగా వుంది."

రావు మాట్లాడలేదు. మాట్లాడలేక పోయాడు.

పోనీ నాన్న .... నాన్నయినా అమ్మ విషయం పట్టించుకున్నాడా? ఏం పట్టించుకొంటాడు? ఎలా పట్టించుకున్నాడు? పస్టు తారీఖు వచ్చేసరికి ఆయన సంపాదిస్తోన్న ఇరవై రూపాయలూ తన చేతికే అందుతున్నాయి. ఇంత కాలం అమ్మని ఎవ్వరూ పట్టించుకోలేదా? తను ఏం చెయ్యాల్పిడు? .... ఏమీ తోచలేదు రావుకి.

మధ్యాహ్నం భోజనానికి వచ్చేసరికి యిల్లంతా హడావుడిగా వుంది. లోపలనుంచి నలుగురైదుగురి ఆడవాళ్ల గొంతులు విన్పిస్తున్నాయి. రావుకేదో అనుమానం వచ్చింది. వెనక్కి పోదామా? అని ఆలోచించేంతలో యమున కన్పించింది– వీధి గదిలో కూర్చోండి అన్నం తీసుకొస్తాను —" అంది కంగారుగా.

"ఏమిటి ఏమైంది? అమ్మకి ...."

"ఏమీ కాలా .... ఇదిగో వచ్చేస్తున్నాను."

"యమునా? ఇలా చూడు. హాస్పిటల్‌కి తీసికెళ్ళరాదూ?"

"ఎవరూ? నేనా?" తీవ్రంగా చూసింది యమున.

"అదే అదే! నాన్న ...."

"ఆయన మంత్రసాని కోసం వెళ్ళారులెండి. అసలు ఆవిడ ఆస్పత్రి కెళ రుట. ఏమైనాసరే .... ఎలా వున్నాసరే" .... యమున లోపలి కెళ్ళింది. రావు ఒక్క నిమిషంకూడా నిలబడకుండా బయట పడ్డాడు. కడుపులో ఆకలి దహిస్తోన్నా ఏమీ తినబుద్ధికాలేదు. హోటళ్ళన్నీ దాటుకుని తిన్నగా ఆఫీసుకుపోయి సీటులో కూర్చున్నాడు.

అసలు అమ్మకి తెలిగ్గా వుందా? అన్న ఆందోళన బాధపెట్టింది. అమ్మకి ఏమైనా అయితే? బాధ్యులెవరు? అమ్మ లేకుండా నాన్న ఎలా

కాలం గడుపుతాడు? ఇంత చిన్న విషయం నాన్న ఎందుకు ఆలోచించక పోయాడు? తను మాత్రం? అమ్మకేమైనా ప్రమాదం జరిగితే తను మాత్రం బాధ్యుడుకాడా? ఇన్నాళ్ళూ అమ్మ ఆరోగ్యం ఎందుకు ఆలోచించలేదు? అమ్మకి మందులవీ ఎందుకు కొనలేదు? కనీసం .... ఆఖరి క్షణంలో .... పురుడు వస్తోందని తెలిసినా అమ్మని హాస్పిటల్‌కి పంపే ఏర్పాటు ఎందుకు చెయ్యలేదు? అమ్మ సుఖంగా వుండటం తనకు మాత్రం అవసరం లేదా?

రావు మనస్సు అల్లకల్లోలమైంది. అమ్మ బిడ్డను కంటోంది. వయస్సు మళ్ళిపోయిన అమ్మకు పురుడు వస్తుంది. రావు మొహమంతా అసహ్యంతో జేవురించింది. స్త్రీ పురుష సంబంధం ఎంత అసభ్యకరం? అమ్మ విలువనే పాడుచేసింది.

ఆఫీసు అయ్యాక అందరికన్న ఆఖర్నలేచి బయటికి వచ్చాడు. ఇంటికేసి నడవటానికి కాళ్ళు మొరాయించాయి. మనస్సు తిరస్కరించింది. అమ్మ సంగతి .... ఊహూ! ఏం వింటాడు?

* * *

వినక చేసేదేముంది? ఎంతకాలం తప్పించుకుంటాడు?

పార్కు దాదాపు నిశ్శబ్దంగా నిర్మానుష్యంగా వుంది. విద్యుద్దీపాల వెలుగుకి భయపడి చెట్లచాటున దాక్కుంది చీకటి.

లేచాడు రావు - వీధి తలుపులు దగ్గరికి వేసివున్నాయి. నాన్న నిద్రపోతున్నాడో లేదోగాని అరుగుపైన మంచంమీద .... పడుకుని వున్నాడు - యమున యింకా చదువుకుంటూనే కూర్చుంది. రావు తన కేమీ పట్టనట్టు బట్టలు మార్చుకొంటూ నిలబడ్డాడు. ఏదో చప్పుడుకోసం రావు కర్ణపుటాలు తీవ్రంగా పనిచెయ్యసాగాయి.

"భలే పెద్దమనిషి. మిమ్మల్ని నమ్ముకుంటే ఎలాంటి పనులైనా జరిగిపోతాయి"- అంది యమున పుస్తకం మూసివేస్తూ - "దేవుడి దయ వల్ల అంతా సవ్యంగా జరిగిందిగానీ"....

ఆత్రుతగా చూశాడు రావు. అంతలోనే చూపు మార్చుకుంటూ

"ఊఁ, లేకపోతేమాత్రం నేనేంచెయ్యాలి?" అన్నాడు. తన కంఠం తనకే కర్కశంగా విన్పించింది.

"ఎవ్వరూ ఏమీ చెయ్యోద్దులెండి .... అంతా సుఖంగా జరిగింది. పోనీ ఏం పిల్ల పుట్టిందనైనా అడగరేం?"

"ఎవ్వరైనా ఒక్కటే నాకు"-అంటూ ఉయ్యాల దగ్గిరికి నడిచాడు.

"ఉహూ! ఒక్కటే ఎలా అవుతుంది? మీతో పోటీ పడటానికి తమ్ముడే పుట్టాడు."

అతి సామాన్యంగా అడుగుతున్నట్టు అడిగాడు. "నిజంగానా?"

"బావుంది ఎప్పుడూ హాస్యమేనా? నిజంగా నేను మరిదే కావాలను కున్నాను- ఇప్పుడే సుశీలకి ఉత్తరం రాసి యిలా కూర్చున్నాను."

రావు మాట్లాడలేదు. యమున దగ్గిరగా వచ్చి నిలబడింది-

"నిజంగా మీ తమ్ముడు మీలాగే వున్నాడు. ఆ కళ్లూ .... ఆ ముక్కూ ....

"చాల్లే, ఊరుకో."

"నా మాట నమ్మకపోతే పోనీ, మీరే వచ్చి చూడండి .... అబ్బో! అబ్బాయిగారి కెంత గర్వం! అన్నదమ్ము లిద్దరూ కలిసి...."

రావు పెదవులమీద నవ్వు చిందింది. తమ్ముడు .... తమ్ముడు.... అవును. ఒకప్పుడు .... తను చాలా చిన్నవాడుగా వున్నప్పుడు - సుమారు పదిహేడు, పద్దెనిమిదేళ్ళ క్రిందట - తని కా కోరిక వుండేది - "అమ్మా! మన కో తమ్ముడుంటే బావుంటుందే!" - అన్నాడు అమాయకంగా ఓసారి.

సుశీలకూడా తనని బలపరచింది - నిజమేనే అమ్మా! తమ్ముడుంటే ఆడుకోటానికి బావుంటుందే!" - అంది పేచీ పెడుతోన్నట్టు. అమ్మ నవ్వింది - సుశీల బుగ్గలు ముద్దుపెట్టుకొంది. తన జుత్తు ప్రేమగా నిమిరింది "తమ్ముడుంటే మళ్ళా వాడు యింకో తమ్ముడు కావాలని అడగడూ? ఆడుకుందుకు మీ రిద్దరూ వున్నారుగా?" అంది.

తన కిప్పుడు తమ్ముడున్నాడు. వాణ్ణిచూస్తే ఒక్కసారి .... "సుశీలా! మనకి తమ్ముడున్నాడే!" అని చెప్తే....? ఒక్కసారి చిన్న

పిల్లలై ఆడుకుంటే ... ? తమ్ముడు ఎలా వున్నాడసలు? తనలా గాక యింకెలా వుంటాడు?

కేరుమన్నాడు పసిపాప. ఝుల్లుమన్నాయి రావు గుండెలు. కంగారుగా అయోమయంగా గుమ్మంకేసి చూశాడు.

"మౌనవ్రతం చాలుగాని, లేచి స్నానానికి వెళ్ళండి" - అంటూ వెళ్ళిపోయింది యమున. రావు కొడుకుని భుజంమీద వేసుకొని చాలాసేపు పచార్లు చేశాడు. రాత్రంగా మగత మగతగానే నిద్రపట్టింది. తమ్ముడి ఏడుపు విన్పిస్తూనే వుంది - యమున అమ్మ గదిలోనే పడుకొంది.

మూడోనాడు .... సుశీలతో వాళ్ళత్తగారుకూడా వచ్చింది. అమ్మకి పత్యాలూ పానాలూ ఆవిడ చేతిమీదగానే జరిపింది.

"ఒరేయ్ అన్నయ్యా! తమ్ముణ్ణి చూశావూ?" - అంటూ సుశీల వస్తే రావు పేపర్లో తల దూర్చుకొంటూ - "చూస్తాలేవే! ఏం కంగారూ?" అన్నాడు.

ఐదోరోజు కాబోలు - ఆఫీసుకు శెలవు. మధ్యాహ్నం అన్నంతిని చదువుకొంటూ నిద్రపోయాడు రావు. యమున గబ గబా తట్టి లేపుతోంటే వులిక్కిపడి లేచాడు - అమ్మ గదిలో ఏమిటో కంగారు పడుతోన్నట్టు విన్పించింది.

"తొందరగా వెళ్ళి ఎవరైనా డాక్టర్ని తీసుకురావాలి. మీ తమ్ముడు అదేమిటో .... కర్రలా బిగుసుకుపోయాడు.

యమున చెప్పిందేవిటో రావుకి అర్థం కానేలేదు.

"మామయ్య ఎక్కడికో బయటికి వెళ్ళారు. మీరు లేచి వెళ్ళకపోతే ఎలా?" - అంది భయంగా చూస్తూ.

"ఆయన కీ వూళ్ళో ఏం వ్యవహారాలు వుండిపోయాయో!" వెటకారంగానే అన్నాడు రావు.

"బావుంది. ఇలా అవుతుందని ఆయనేం కలగన్నారా? అయ్యో! మీరు లేచి వెళ్ళరూ? మీ అమ్మ యేడుస్తున్నారు ...." కాలు నిలవని దానిలా ఆ గదిలోకి పరిగెత్తింది యమున.

"భయపడకమ్మా! చిన్నపిల్లగుణం వచ్చింది. అబ్బాయి వెళ్లా

డుగా? డాక్టర్ని తీసుకొస్తాడు. కాసిన్ని వుల్లిపాయ లిలా తీసుకురండి. రసం తీసి చెవుల్లో ముక్కుల్లో పోస్తాను" - సుశీల అత్తగారి మాటలు వింటూ రావు అలాగే కూర్చున్నాడు.

అమ్మ వెక్కిళ్ళు స్పష్టంగా వినిపిస్తున్నాయి - "భగవంతుడా! నువ్వేది ఒడిగడితే అది ప్రసాదమని భరించుకున్నాను. ఇంటా బయాటా నవ్వులపాలై ఈ పసిబిడ్డకోసం గుండె రాయి చేసుకున్నాను. ఈ వయస్సులో నన్నీ అవమానాలతోపాటు గర్భశోకంకూడా భరించమంటావా తండ్రీ!" అమ్మ గొంతు పూడిపోతోంది దుఃఖంతో.

రావు గుండె కోసినట్టయింది.

అమ్మ నవ్వులపాలైంది .... తమ్ముడికోసం.

అమ్మ అవమానం సహించింది .... తమ్ముడికోసం.

అమ్మ ఏడుస్తోంది .... బిడ్డకోసం.

చటుక్కున లేచి చొక్కా తగిలించుకున్నాడు రావు.

కెవ్వుమన్నాడు పసికందు. కేరు కేరుమంటూ గుక్కపట్టి ఏడవ సాగాడు.

"కాసిన్ని వేడినీళ్ళు తీసుకురామ్మా! ఆముదంకూడా తీసుకురా! ఒళ్ళు కాస్తాను" - అంటోంది సుశీల అత్తగారు.

రావు మొదలు నరికిన తరువులా కూలబడిపోయాడు. తను ఎంత రాక్షసుడయ్యాడు. తమ్ముడు చచ్చిపోవాలని తను కోరుకుంటున్నాడా? లేకపోతే ఎందుకు డాక్టర్ దగ్గరికి పరుగెత్తలేదు? నవమాసాలు మోసి అమ్మ తమ్ముణ్ణి కంటే తను నిష్కారణంగా చంపేస్తాడా? పాపం? — అంత పసివాడు - తమ్ముడేం చేశాడు తనని?

రావుకి తనమీద తనకే అసహ్యం వేసింది.

"ఎవరెన్ని అనుకున్నా నా బిడ్డని నేను పెంచుకుంటాను" అంటోంది అమ్మ ఏడుస్తూనే - రావు హృదయం బరువెక్కింది. తను తప్ప అమ్మకి యింకెవరున్నారు? ఎందుకనుకుంటారు? ఎవరో అనుకున్నారని అమ్మ ఎందుకు భయపడుతుంది? ఏ తల్లి గర్భశోకాన్ని కోరి తెచ్చుకుంటుంది?

రావు ఒక్కడే గదిలో కూర్చోలేకపోయాడు. అడుగుల చప్పుడు విన్పించకుండా బయటికి నడిచాడు.

* * *

తెల్లవారుఝామునుంచే యింట్లో సందడిగావుంది. పెరట్లో అమ్మ స్నానానికి సన్నాహ లవుతున్నాయి – మరి పడుకోబుద్ధి వెయ్యక రావు కూడా చీకటితోనే లేచి మొహం కడుక్కొని వేడి వేడి నీళ్ళతో స్నానం చేశాడు. రాగానే యమున కాఫీ అందించింది – నవ్వుతూ యమునకేసి చూశాడు – రావు మనస్సు చాలా ప్రశాంతంగా వుంది – "యమునా! చిన్నప్పుడు యేపైనా పండుగలువస్తే యిలాగే చీకటితో లేచిపోయి...."

"మీ చెల్లాయిని పిలుస్తాను. చిన్నతనం ముచ్చటించుకోండి" అంటూ అడ్డుచెప్పి వయ్యారంగా వెళ్ళబోయింది యమున.

కొంగు పట్టుకుని ఆపాడు రావు– "నీకు మాత్రం చిన్నతనం లేదేమిటి?"

"నేను చిన్నతనంలో ఇంత చీకటితో ఒక్కసారి కూడా లేవలా. హాయిగా ఎనిమిది గంటలవరకూ పడుకునేదాన్ని."

"అందుకే అలా బద్ధకిస్తూ నిద్రపోతూ వుంటావు. చాల్చాల్లే వెళ్ళు నిద్రమొహం నువ్వూను."

యమున బుగ్గన వేలు పెట్టుకొంటూ అంది – "ఎందుకో యివ్వాళ దొరగారు ఖుషీగా వున్నారు."

"ఉన్నాం అంతే. వెన్నెలెందుకు కాస్తుంది? కోయిలెందుకు కూస్తుంది?" – అంటూ కొడుకు బుగ్గలమీద ముద్దుల వర్షం కురిపించాడు.

"ఓహో! కవిత్వంకూడా పుడుతోంది. ఎందుకైనా మంచిది. ఒంటరిగా కూర్చోండి. వస్తా"– యమున ప్రేమ్‌నికూడా లాక్కుపోయింది. రావు నవ్వుకుంటూ సిగరెట్ వెలిగించి పుస్తకం తెరచుకుని కూర్చున్నాడు.

తమ్ముడు ఏడుస్తున్నాడు కేరు కేరుమంటూ.

సుశీల నవ్వుతోంది. వాణ్నేమిటో అంటూ.

"ఎందుకమ్మా వాణ్ని ఏడిపిస్తున్నావు?" – అంది అమ్మ.

"లేదమ్మా? నేనేమీ చెయ్యలా. కాటుక పెడుతోంటే ఏడుస్తున్నాడు.

ఉత్త అల్లరి వెధవ!" - సుశీల తమ్ముణ్ని ముద్దులు పెట్టుకోవటం కూడా - స్పష్టంగా విన్నాడు రావు.

రావు మనసు దేనికో ఆతృత పడుతోంది.

పుస్తకం మూసి లేచి నిలబడ్డాడు - తమ్ముణ్ని చూస్తే ... ? ఒక్కసారి .... ఎలా? అమ్మ మొహం ఎలా చూస్తాడు? ...

రావు మనసులో ఏ నిర్ణయమూ నిలువలేదు.

తను ఎందుకింత అమానుషంగా తయారయ్యాడు? గుండె నింత బండగా ఎలా చేసుకోగలిగాడు? - దీర్ఘంగా నిట్టూర్చాడు రావు.

సూర్య కిరణాలు సూటిగా గదిలోకొచ్చి పడుతున్నాయి. ఆ వెలుగు పొడుగునా ఎగురుతోన్న ధూళిని చూస్తూ ఎంతోసేపు స్థాణువులా నిలబడ్డాడు.

అప్రయత్నంగా గదిలోంచి బయటికి వచ్చాడు.

అప్రయత్నంగానే అమ్మ గది ముందుకు వెళ్ళి పోయాడు.

అమ్మ తమ్ముడికి పాలిస్తోంది - వారగా వేసివున్న తలుపుల మధ్య నుంచి కన్పిస్తోన్న ఆ దృశ్యం .... ముగ్ధుణ్ని చేసింది రావుని. తదేకంగా చూస్తూ నిలబడ్డాడు.

తలరా స్నానం చేసిన అమ్మ జుట్టు విరబోసుకుంది. చెంపలు తెల్లగా నెరసి వున్నాయి. బుగ్గలలో గుంటలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. నీరసంతో తెలతెల బోతున్న అమ్మ కన్నుల్లో చిత్రమైన తృప్తి, పల్చగా పసుపు రాసుకున్న అమ్మ మొహంలో అంతుపట్టని గర్వం! అమ్మలో ఎన్నడూ చూడని అందం కన్పిస్తోంది.

పసి గుడ్డుని గుండెలకు హత్తుకొని తల నిమురుతూ పాలిస్తున్న అమ్మ ఆనందంతో తన్మయమౌతోంది.

అమ్మ! ఎవరీ అమ్మ!

పాతిక సంవత్సరాల క్రిందట అమ్మవడిలో తను యిలాగే .... తమ్ముడిలాగే .... ఆత్రంగా ఆకలిగా .... పాలు తాగి వుంటాడా?

అమ్మ- ఇలాగే .... తన గుండెలకు హత్తుకొంటూ - మాటిమాటికి ఒళ్ళు నిమురుతూ పాలు యిచ్చి వుంటుందా?

ఒకసారి అమ్మ కౌగలిగిస అమ్మకి వయస్సేమిటి?

ఒక బిడ్డను కని పెంచిన అమ్మకి హద్దేమిటి?

ప్రకృతి ధర్మాన్ని పరిహసించటం ఎంత అవివేకం!

దైవఘటనని ఆక్షేపించడం ఎంత మూర్ఖత్వం! ఇంత కాలం ఎందుకు తను అమ్మని అసహ్యించుకున్నాడు ఈ వయసులో అమ్మ ఎంత బాధ్యత భరించాలి? ఎంత ఓరిమి కోరి తెచ్చుకోవాలి?

తమ్ముణ్ని వేయి కళ్ళతో కాపాడుకొంటుంది అమ్మ. తలుపులు బార్లా తీసుకుని అమ్మగదిలోకి దూసుకెళ్ళాడు రావు. నిర్ఘాంతపోయింది అమ్మ —— సిగ్గుపడి పోయింది అమ్మ. కొంగు ఒంటినిండా కప్పుకుని తల దించేసుకుంది అమ్మ.

"అమ్మా!" —— రావు కంఠం వణికింది. "ఒక్క సారి తమ్ముణ్ని యివ్వమ్మా! చూస్తాను" —— తనే ఒంగి పసివాణ్ని అందుకున్నాడు. తహ తహతో వాడి మొహంలోకి చూశాడు. మృదువుగా వాడి చెక్కిళ్ళు ముద్దు పెట్టుకున్నాడు - రావు హృదయం దూదిపింజెకన్న తేలికైంది. కళ్ళలో నీటి పొర కమ్మింది - "అమ్మా!"

విస్మయంతో చూసింది అమ్మ! అమ్మ కళ్ళనిండా నీళ్ళు సుళ్ళు తిరిగి చెంపల మీదుగా జారాయి. దోషిలా నిలబడ్డాడు రావు. అమ్మ చటుక్కున చెంపలు ఒత్తుకుంది- "కూర్చోనాయనా!" - అంది ప్రేమగా, రావు అమ్మ దగ్గర కూర్చున్నాడు. తమ్ముణ్ని ఒళ్లో పడుకో బెట్టుకున్నాడు —— "అమ్మా! వీడు నా పోలికేకదూ?"

నవ్వింది అమ్మ - సుశీల కంగారుగా వచ్చింది - "ఒరేయ్? వాణ్ని జాగ్రత్తగా పట్టుకోవాలిసుమా! అయినా నువ్వు యిక్కడి కెందు కొచ్చావూ?"

అదేం విన్పించు కోలేదు రావు- "సుశీ! తమ్ముడు నా పోలికేకదే!"

"నీ పోలికేం కాదు. నాలా వున్నాడు."

"పో! నీ పొట్టిముక్కు నువ్వూను. అచ్చం నాలా వున్నాడు. కావాలంటే అమ్మ నడుగుదాం. ఏమ్మా? తమ్ముడు ఎవరిలా వున్నాడు?"

"నిజం చెప్పమ్మా! నాలా లేడూ!"

అమ్మ మళ్ళా నవ్వింది. కళ్ళలో మిగిలివున్న రెండు కన్నీటి బొట్లు రాలి పడ్డాయి.

(1965 జనవరి "యువ" నుంచి)